
బూర్జువా పార్టీ"నే. ఇదే విమర్శ 1983లో కమ్యూనిస్టు నాయకులు చేశారు.అయితే, అనంతర పరిణామాల వల్ల ఎన్టీఆర్‌తో చేతులు కలిపారు. 1984 పార్లమెంటు ఎన్నికల నాటి నుంచే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తెలుగుదేశంతో 'దోస్తీ' చేశాయి. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు తగాదా ఆడుకున్నాయి. కానీ ఏ దశలోనూ ఎన్టీఆర్‌తో పేచీపడలేదు. ఎన్టీఆర్ ఇచ్చే సీట్లతో సంతృప్తి పడి వాటి నుంచే పోటీ చేసేవారు.

1925 డిసెంబర్ 26న ప్రారంభమైన కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాల చరిత్ర కలిగి ఉంది. సిద్ధాంత విభేదాలతో 1964లో పార్టీ చీలిపోయింది. ఇది పార్టీ పురోగమనానికి ఎంతో నష్టం కల్గించింది. ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీ నిట్ట నిలువుగా చీలడం వల్ల మరింత నష్టం కలిగింది. 1962 ప్రారంభంలో జరిగిన




ఎన్నికలలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడి రాష్ట్ర శాసన సభలో 51 సీట్లు లోక్‌సభ ఎన్నికలలో ఏడు స్థానాలను గెలుచుకున్న అవిభాజ్య కమ్యూనిస్టు పార్టీ చీలిక తర్వాత కూలిపోయింది. తదుపరి వచ్చిన ఎన్నికలలో పది పన్నెండు స్థానాలలోను తెలుగుదేశం పార్టీని దేబిరించాల్సిన దుర్గతి పట్టిందని చంద్ర రాజేశ్వరరావు స్వయంగా రాసిన ఒక వ్యాసంలో పేర్కొన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణా సాయుధ పోరాట కాలంలోనే విశాలాంధ్రలో ప్రజా రాజ్యాన్ని స్థాపించాలని నినాదాన్నిచ్చింది. ప్రజారాజ్యమైతే ఇంతవరకూ సాధించలేదుకానీ ఇతర ఎన్నో ముఖ్య విజయాలను సాధించినట్లు చెప్పుకోవడం కమ్యూనిస్టు అలవాటుగా మారింది. "మా తాతలు నెయ్యి తాగారు. మా మూతి వాసన చూడండి" అన్న చందాన కమ్యూనిస్టు పార్టీల చరిత్ర చెప్పుకోవాల్సి ఉంది.

"బూర్జువా పార్టీ"తో స్నేహం చేసినందుకేమో గానీ ఇటీవల భూ ఆక్రమణ ఆరోపణలు సిపిఐ, సిపిఎం నాయకులపై చాలా వస్తున్నాయి. కార్మిక కర్షక లోకానికి ప్రతినిధిగా వహించాల్సిన కమ్యూనిస్టు పార్టీలకు వ్యతిరేకంగా ఇటీవల తిరుపతిలో కార్మిక కర్షకుల ఊరేగింపులు జరిపారంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. సిద్ధాంతాలు మరచి మామూలు రాజకీయ పార్టీలుగా మిగిలిపోయిన కమ్యూనిస్టులు ఇప్పటికే ఉనికిని కోల్పోగా రానున్న కాలంలోనైనా పోరాట పటిమ అలవరచుకోవాల్సి ఉంటుంది.

**-పి.సత్యమూర్తి**

# సేవ చేయండి!

"ప్రజలకి మనం అనేక రకాలుగా సేవ చేయాలని పోయిన మంత్రివర్గ సమావేశంలో అనుకున్నాం. వివిధ పథకాలూ, కార్యక్రమాలూ రూపొందించమని కోరాను. ప్రజలకి సేవ చేయడంలో ఎంతమాత్రం వెనుకాడకూడదు. నిద్రాహారాలు మాని ప్రజలకు సేవ చేయాలనేది మన పార్టీ లక్ష్యం. ప్రజల జీవితాలు మెరుగుపరచడానికీ, ప్రజల జీవితాల్ని సంస్కరించడానికీ మీరు ఏఏ పథకాలు రూపొందించారో తెలియచేయండి!" మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి తోటి మంత్రుల్ని కోరాడు.

"మరి నిధుల విషయం సార్...."ఒక మంత్రి లేచి ధర్మ సందేహాన్ని వెలిబుచ్చాడు.



"నిధుల గురించి ఎలాంటి ఆలోచనా పెట్టుకోవద్దని నేను పోయిన సమావేశంలోనే స్పష్టంగా చెప్పాను. నిధుల గురించి పట్టించుకోవద్దు. ప్రజలకి మేలు చేయడానికి ఎన్నివేల కోట్ల రూపాయలు అయినా వెనుకాడే ప్రశ్నే లేదు. డబ్బు కంటే ప్రజలకి సేవ చేయడమే మనకి ముఖ్యం! ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాయించుకోవాలంటే వాళ్ళకి పనులు చేయడమే మార్గం! కనుక మీరు మీ మదిలో ఉన్న పథకాలు తెలియచేయండి!"

"ఉండటానికి నివాసం కూడా లేని జనం కొన్ని కోట్ల మంది వున్నారు. నీడ కూడా లేకుండా జనం బతుకుతున్నారంటే నా హృదయం ద్రవించిపోతోంది. అలాంటి పేదల కోసం మంచి వసతులతో 50 లక్షల పక్కా గృహాలు నిర్మించడానికి పథకాలు సిద్ధం చేశాను!" గృహ నిర్మాణ శాఖ మంత్రి ప్రకటించగానే చప్పట్లు మోగాయి.

"మనకి నిరుద్యోగ సమస్య తీవ్రంగా వుంది. ఉన్నత చదువులు అభ్యసించి కూడా చాలా మంది నిరుద్యోగులగా వున్నారు. అలాంటి నిరుద్యోగ యువకులకి నెలకి వెయ్యి రూపాయల భృతి ప్రకటిద్దాం" ఉపాధి కల్పనా శాఖ మంత్రి వుత్సాహంగా వెల్లడించాడు.

"మన పాలనలోఎవరూ తిండి సమస్యతో బాధపడకూడదు. కుటుంబం మొత్తానికి నెలకి సరిపోయేటన్ని బియ్యం కేజీ ఒక రూపాయి యాభై పైసలకే ఇస్తే ప్రజలు హర్షిస్తారు" అని ఇతర మంత్రుల హర్షధ్వానాల మధ్య ఆహారశాఖ మంత్రి తెలిపారు.

"భూమి అనేది ముఖ్యమైన సమస్య. మన రాష్ట్రంలో వున్న మిగులు భూమి వివరాలు సేకరించాం. దాదాపు 5 కోట్ల ఎకరాలు మిగులు భూమి వున్నట్లు తేలింది. భూమిలేని పేదలకి ఒక్కొక్కరికి 4 ఎకరాలు ఇవ్వడానికి పథకం రూపొందించాను" అని రెవిన్యూమంత్రి ఆనందంగా ప్రకటించాడు.

"మనకి అనేక వనరులు వున్నాయి. ఎన్నో భారీ పరిశ్రమలు స్థాపించుకోవచ్చు. రాష్ట్రంలో భారీగా భారీ పరిశ్రమలు స్థాపించి కోటి మందికి ఉద్యోగావకాశాలు కల్పించడానికి వీలుగా ఒక బృహత్తర ప్రణాళిక సిద్ధం చేశాను. దీంతో పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుందీ, కోటి మందికి ఉద్యోగాలూ లభిస్తాయి" అని భారీ పరిశ్రమల శాఖ మంత్రి భారీ సంతోషంతో భారీ ప్రణాళికను వెల్లడించారు.

"ప్రతి వూరికీ ఒక ఆస్పత్రి కట్టిద్దాం. ఆ ఆస్పత్రిలో ఒక డాక్టర్ని నియమిద్దాం. ఇక సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లతో సంచార వైద్య బృందాల్ని ఏర్పాటు చేద్దాం. అందరికీ ఆయురారోగ్యాలు కలిగిద్దాం!" అనారోగ్యంతో బాధపడుతున్న ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటించడంతో మంత్రులందరూ సంతోషం పట్టలేక ఎదురు టేబుళ్ళని చరిచారు.

"రైతుల శ్రేయస్సు కోసం, భూమిని సస్య శ్యామలం చేయడం కోసం వెయ్యి ఎత్తిపోతల పథకాలూ, కొన్ని భారీ ఆనకట్టలూ నిర్మించడానికి పథకాలు వున్నాయి. అలాగే రైతులకి 90 శాతం సబ్సిడీతో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడానికి కూడా సిద్ధంగా వున్నాను" అన్నాడు వ్యవసాయ మంత్రి.

మంత్రులు వాళ్ళు చేయతలపెట్టిన వివిధ పథకాల గురించి చెప్పుకొచ్చారు.

"మీరు ఇంత బృహత్తర పథకాలు రూపొందించినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నారు. ఇవి మనం చేస్తున్నట్లు ప్రచారం కావాలి. ఇంకా మూడు నెలలోనే ఎన్నికలు కూడా రాబోతున్నాయి. ప్రజలకి మనం చేయాలి. తప్పకుండా చేయాలి. భారీగా చేయాలి. ప్రజలకు సేవ చేయడంలో ఎంతమాత్రం వెనుకంజ వేయకూడదు. కనీసం ఇలా వాగ్దానాల సేవ కూడా చేయకపోతే ప్రజలు మనల్ని విస్మరిస్తారు. కనుక మనసేవ వాగ్దానాలకే పరిమితం చేసి భారీగా చేద్దాం. ప్రచారానికి సంబంధించి నిధులకే ఢోకా లేదు. భారీగానే నిధులు వున్నాయి" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. మంత్రులు అందరూ సంతోషంతో సంతృప్తిగా లేచారు.

**-మొలకలపల్లి కోటేశ్వరరావు**